

## పనులు వేగవంతం చేయాలి

**వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**

వికారాబాద్, మార్చి 21 : గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను కూలీల సంఖ్యను పెంచుతూ పనులు వేగవంతం చేయాలని, ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సీసీ రోడ్లు, లేబర్ మొబిలైజేషన్ తక్కువగా ఉన్న గ్రామాలపై దృష్టి సారించి పనులు పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో అన్ని మండలాల్లో అంచనా ప్రకారం ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి 100 శాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు పూర్తయిన వాటికి ఎఫ్‌టీవో తప్పనిసరిగా జనరేట్ చేయాలన్నారు. ఏ మండలంలో ఏ తేదీ వరకు ఎఫ్‌టీవో జనరేట్ అయినది, ఇంకా చేయాల్సినవి ఎన్ని ఉన్నాయో చెక్ చేసుకునేలా ఆయా మండలాల టీఏలకు సూచించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ పాల్గొన్నారు.

# ఓటు హక్కును వినియోగించుకోవాలి

◆ రంగారెడ్డి కలెక్టర్ శశాంక
◆ కలెక్టరేట్‌లో 'స్వీప్'పై నోడల్ అధికారులతో సమావేశం



'స్వీప్'పై నోడల్ అధికారులతో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : ప్రతి ఓటరు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టరేట్‌లో 'స్వీప్'పై నోడల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటనేది ఆయుధమని.. ఇప్పటికే ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. 18 సంవత్సరాలు నిండినవారు విధిగా ఎపిక్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, పరిగి, తాండూరు, వికారాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్లు ఉంటాయని, ఎక్కువ నియోజకవర్గాలు అర్బన్ ప్రాంతంలో ఉన్నందున ఓటింగ్ శాతం తక్కువ నమోదు అవుతున్నదన్నారు. ఈ ప్రాంతాల్లో ఉన్న కళాశాలల విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా స్వీప్ ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు 5కె రన్ నిర్వహించాలని, వాల్ పోస్టర్స్ ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. గ్రేటర్ కమ్యూనిటీ రెసిడెన్షియల్ అసోసియేషన్ వారితో సమావేశాలు నిర్వహించి ఓటింగ్ శాతం పెంచాలన్నారు. మహిళా సంఘాలు, విద్యార్థుల ద్వారా వారి కుటుంబాల్లో ఓటుపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా స్వీప్ నోడల్ అధికారి శ్రీలత, డీపీవో సురేశ్ మోహన్, డీఈవో సుశీందర్‌రావు, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కొడంగల్ : మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా తనకు బాధ్యతలు అప్పగించినందుకు సీఎం రేవంత్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిసి ధన్యవాదాలు తెలుపడంతోపాటు సీఎం చిత్రపటాన్ని బహూకరించారు. అప్పగించిన బాధ్యతను తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఉన్నారు.



**పూలదారి.. కనులకింపు**

పెద్దఅంబర్‌పేట : మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం ఇందు అరణ్య గేటెడ్ కమ్యూనిటీ ఎదురుగా ఉన్న కొత్త రోడ్డులో రంగుల పూలు ఆకట్టుకుంటున్నాయి. ఎండలు మండుతున్న వేళ.. రహదారికిరువైపులా పూసిన పూలు వాహనదారులు, ప్రయాణికులకు కనులవిందుచేస్తున్నాయి.

## వైద్యుడి పనితీరుపై విచారణ



అంగడిరైచూర్ వైద్యుడితో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి చంద్రప్రకాశ్

కొడంగల్, మార్చి 21 : మండలంలోని అంగడిరైచూర్ గ్రామ ప్రాథమిక ఆసుపత్రి వైద్యుడు డా.హరిప్రసాద్ జిల్లా వైద్యశాఖ గ్రూపులో అసభ్య పదజాలంతో పోస్టు చేశారని, దానిపై విచారించేందుకు వచ్చినట్లు జిల్లా ప్రోగ్రాం అధికారి చంద్రప్రకాశ్ తెలిపారు. గురువారం ఆసుపత్రి సిబ్బందితోపాటు ఆశ కార్యకర్తలతో జిల్లా అధికారి ప్రత్యేకంగా విడివిడిగా సమావేశమై వైద్యుడి పనితీరుపై విచారించారు. వైద్యుడి తీరు సరిగ్గా లేదని సిబ్బంది చెప్పారని, డాక్టర్‌ను సరెండర్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# పర్యావరణాన్ని పరిరక్షించాలి

❍ వాతావరణ కాలుష్యంలో భారతదేశానిది మూడో స్థానం
❍ ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ఎంఈఐఎల్ డైరెక్టర్ సుధారెడ్డి



పెద్దమంగళారం రెవెన్యూలో మొక్కలు నాటుతున్న ఎంఈఐఎల్ డైరెక్టర్ సుధారెడ్డి

మొయినాబాద్, మార్చి 21 : వాతావరణ కాలుష్యంలో భారతదేశం మూడో స్థానంలో ఉందని.. పర్యావరణ పరిరక్షణకు అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన ప్రధాన కర్తవ్యం ప్రతి పౌరుడిపై ఉందని ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ఎంఈఐఎల్ డైరెక్టర్ సుధారెడ్డి అన్నారు. ఎస్ఆర్ ఫౌండేషన్, మెగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంయుక్తంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 10 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంలో భాగంగా గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని రోడ్డు పక్కన పెద్దమంగళారం రెవెన్యూలో మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో అటవీ ప్రాంతం పూర్తిగా అంతరించిపోతున్న క్రమంలో వాతావరణ కాలుష్యంలో దేశం మూడో స్థానంలో నిలువడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటే మానవాళి మనుగడకు తీవ్ర ప్రమాదకరంగా మారుతుందని చెప్పారు. రోజురోజుకూ దేశంలో ఆక్సిజన్ స్థాయి తగ్గిపోతున్నదన్నారు. బహుళ అంతస్తు భవనాలతో అభివృద్ధి జరగడమే అభివృద్ధి కావచ్చు కానీ.. అభివృద్ధి జరగడంతో పాటు మొక్కలను అదేస్థాయిలో పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది రెండు తెలుగు రాష్ట్రాల్లో రోడ్ల పక్కన, విద్యాసంస్థలు, ప్రార్థనా మందిరాలు, దవాఖానలు, అటవీ ప్రాంతాల్లో కూడా ఈ ఏడాది 10 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. రానున్న 5 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా సుమారు కోటి మొక్కలను నాటాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వాలు కూడా కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఎవరైనా ఇండ్లు కట్టుకుంటే నిర్మాణం చేపట్టే ఇంటి స్థలంలో 10 శాతం పచ్చదనాన్ని పెంచాలని నియమ నిబంధనలను ప్రభుత్వం జారీ చేయాలన్నారు. విరివిగా మొక్కలు నాటడంతో వాతావరణ సమతుల్యత ఏర్పడి సమృద్ధిగా వర్షాలు పడి పంటలు బాగా పండటానికి అవకాశముంటుందని చెప్పారు. మానవ జీవితంలో అంతర్భాగమైన ప్రకృతి, వాతావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతని పేర్కొన్నారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ తమ ఫౌండేషన్ లక్ష్యమని చెప్పారు. ఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు దేశవ్యాప్తంగా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఆర్ ఫౌండేషన్, ఎంఈఐఎల్ ఫౌండేషన్ ప్రతినిధులున్నారు.

# కనులపండువగా కల్యాణోత్సవం

◆ భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
◆ పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జడ్పీటీసీ దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్, మార్చి 21 : మండల పరిధి రావిచేడ్ గ్రామం వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గురువారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని శుద్ధజలం, పంచామృతాలతో అభిషేకించారు. ఆలయ అర్చకులు రామానుజాచార్యులు, ఆదిత్యాచార్యులు, చిదంబరశర్మ, క్రాంతికుమార్, శిరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. వివిధ రకాల పూలమాలలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను అందంగా ముస్తాబు చేశారు. అమ్మవారితోపాటు స్వామివారికి ఆలయ ధర్మకర్త రామచందర్‌రావు పట్టువస్త్రాలు, పుస్తెమెట్టెలు అందజేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పాల్గొని పూజలు చేశారు.

అనంతరం ఆలయ ఆవరణలో కడ్తాల్ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నదానం చేశారు. అంతకుముందు ఆలయంలో ప్రజాప్రతినిధులను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో పీవీ నరసింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ సెంటర్ సహకారంతో మెడికల్ క్యాంపు ఆర్గనైజర్ నాగరాజు సుధాకిరణ్, క్రాంతికుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 20 మంది రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఎంపీటీసీ గోపాల్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీదేవి, విఠలయ్యగౌడ్, మహేందర్‌రెడ్డి, లోకేశ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ వసంత, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్, ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణశర్మ, అడ్వకేట్లు కృష్ణయ్య, యాదిలాల్, వెంకట్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు, మల్లేశ్, శేఖర్, నాయకులు రంగయ్య, వీరయ్య, శ్రీను, బాలకృష్ణ, పవన్, పారేశ, రమేశ్, యాదయ్య, రవి, లింగం, కస్నానాయక్, భిక్షపతి, వెంకటేశ్, శ్రీశైలం, బీరప్ప, రాములు, శేఖర్, సుభాశ్, జగన్, రాజు, సంతోశ్, రామచంద్రయ్య, సత్తయ్య, సాయికుమార్, పాండు, మహేశ్ ఉన్నారు.



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

## కొనసాగుతున్న 'పది' పరీక్షలు



షాబాద్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రానికి వచ్చిన విద్యార్థులు

షాబాద్, మార్చి 21 : పదో తరగతి పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. గురువారం రంగారెడ్డిజిల్లాలో 50,895 మంది విద్యార్థులు ఇంగ్లిష్ పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. 50,744 మంది హాజరైనట్లు సంబంధిత విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 239 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఓ చీఫ్ సూపరింటెండెంట్, ఓ డిపార్ట్‌మెంట్ అధికారి, 2,450 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రతి కేంద్రానికి ఓ సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 144 సెక్షన్‌ను విధించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**వికారాబాద్ జిల్లాలో..**

వికారాబాద్ : వికారాబాద్ జిల్లాలో 13,406 మంది విద్యార్థులకు 13,347 మంది హాజరయ్యారు. ప్రైవేటులో విద్యార్థులు 42 మంది ఉండగా.. 28 మంది హాజరయ్యారు. ఒక విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడడంతో డిబార్ చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 80 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.




# సీఆర్‌ఎంపీ అటకెక్కిందా?

GHMC

గ్రేటర్ స్ఫూర్తిగా ఢిల్లీ, ఇతర మెట్రో నగరాల్లో సీఆర్‌ఎంపీ విధానం అమలు

గత ప్రభుత్వ హయాంలో విజయవంతంగా మొదటి దశ పూర్తి

మూడునెలలైనా కొత్త ప్రాజెక్టుల ఊసెత్తని కాంగ్రెస్ ప్రభుత్వం

కొత్త సర్కారు ముందు రూ.696.71 కోట్లతో జీహెచ్‌ఎంసీ రెండో విడుత ప్రతిపాదనలు


సిటీబ్యూరో, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్(సీఆర్‌ఎంపీ) పథకం కింద రెండో దశ పనులు చేపట్టాలన్న జీహెచ్‌ఎంసీ ప్రతిపాదన అటకెక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటినా కొత్త ప్రాజెక్టుల ఊసే ఎత్తడంలేదు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వానికి సీఆర్‌ఎంపీ రెండో దశలో రూ.696.71 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ కోరినప్పటికీ సర్కారు నుంచి ఎలాంటి పరిపాలన అనుమతులు లభించలేదు. దీంతో ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కమిషనర్ సైతం సీఆర్‌ఎంపీ రెండో దశపై సమీక్ష జరపడంలేదు. ఫలితంగా ఇప్పట్లో రెండో దశ పనులు ప్రారంభం కావడం కష్టసాధ్యంగానే మారింది. కాగా గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా వాహనదారులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ పధాన రహదారుల నిర్వహణలో భాగంగా 525 విభాగాలుగా విభజించి తొలి విడుతగా 811.958 కిలోమీటర్ల రహదారిని ప్రైవేట్ ఏజెన్సీలకు 2020 సంవత్సరంలో అప్పగించారు. దాదాపు రూ.1050 కోట్ల మేర ఖర్చు చేసి నిర్ణీత లక్ష్యాన్ని గతేడాది అక్టోబర్‌లోనే చేరుకున్నారు. ఈ సీఆర్‌ఎంపీ విధానం ఇతర మెట్రో నగరాలకు ఆదర్శంగా నిలిచింది. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఇప్పటికే సీఆర్‌ఎంపీ మోడల్ వివరాలను తీసుకోగా.. ఛత్తీస్‌గఢ్ , రాజస్థాన్‌కు చెందిన పలు కార్పొరేషన్లు పురపాలక శాఖను సంప్రదించారు. ఇటువంటి పథకాన్ని కొత్త ప్రభుత్వం చేపట్టేందుకు ముందుకు రాకపోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి.

**రూ. 696.71కోట్లతో సీఆర్‌ఎంపీ రెండో దశ ప్రతిపాదనలు**

| జోన్ | ప్రాంతాలు (రహదారులు) | పొడవు (కిలోమీటర్లు) | అంచనా వ్యయం రూ.కోట్లలో |
|---|---|---|---|
| ఎల్బీనగర్ | 82 | 90.53 | 152.98 |
| చార్మినార్ | 90 | 67.68 | 107.64 |
| ఖైరతాబాద్ | 92 | 64.45 | 98.96 |
| శేరిలింగంపల్లి | 89 | 94.785 | 165.65 |
| కూకట్‌పల్లి | 50 | 75.497 | 120.66 |
| సికింద్రాబాద్ | 42 | 29.488 | 50.82 |
| | 445 | 422.43 | 696.71 |

# విద్యార్థులు నూతన విధానాలను అవలంబించాలి

❑ డీఆర్‌డీఎల్ డైరెక్టర్, ప్రఖ్యాత శాస్త్రవేత్త బాలమురళీకృష్ణన్
❑ సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ప్రారంభమైన సియాన్ షి-2024




కార్యక్రమంలో సియాన్ షి-2024 బ్రోచర్‌ను విడుదల చేస్తున్న శాస్త్రవేత్త డా.బాలమురళీకృష్ణన్

ఆదిబట్ల, మార్చి 21 : విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్ చేసేటప్పుడు నూతన విధానాలను అవలంబించాలని డీఆర్‌డీఎల్ డైరెక్టర్, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ బాలమురళీకృష్ణన్ అన్నారు. గురువారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి మంగల్‌పల్లి గ్రామంలో సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సియాన్ షి-2024 కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ వర్క్ అనేది ఎంతో ముఖ్యమైనదన్నారు. రక్షణ, ఏరోస్పేస్ విభాగాల అప్లికేషన్స్‌కు సంబంధించి కూడా విద్యార్థులు కొత్త పద్ధతులను కనుగొని ఆయా విభాగాల అభివృద్ధికి దోహదపడాలన్నారు. సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల 23 సంవత్సరాల్లో సాధించిన ప్రగతిని విద్యార్థులకు కళాశాల చైర్మన్ డాక్టర్ రాఘవ వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన విధానాలపై ఆసక్తి చూపినప్పుడే ఎంతో అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు.

# పార్టీ మారినా.. పదవి పాయే!

❍ మేయర్ పదవి కాపాడుకునేందుకు కాంగ్రెస్‌లో చేరిన మహేందర్‌గౌడ్
❍ ఉత్కంఠ వాతావరణంలో నెగ్గిన అవిశ్వాస తీర్మానం
❍ బండ్లగూడ జాగీర్ నూతన మేయర్ ఎవరో?

బండ్లగూడ, మార్చి 21 : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ ఒంటెద్దు పోకడ పోతున్నారని పలువురు కార్పొరేటర్లు ఆయనపై గతంలో అవిశ్వాసం పెట్టిన విషయం విదితమే. కోర్టు అదేశాలతో గురువారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆర్డీవో వెంకట్‌రెడ్డి అధ్యక్షతన అవిశ్వస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కార్పొరేషన్ పరిధిలో 22 మంది కార్పొరేటర్లలో ఒకరు మరణించగా 21 మంది కార్పొరేటర్లు ఉన్నారు. 11 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశానికి అవిశ్వసం పెట్టిన 16 మంది కార్పొరేటర్లు తప్ప మేయర్ మహేందర్‌గౌడ్‌తో సహా ఇతర కార్పొరేటర్లు హాజరు కాలేదు. దీంతో అవిశ్వాసాన్ని అంగీకరిస్తూ 16 మంది కార్పొరేటర్లు చేతులెత్తి ఓట్లు వేశారు. కోరం సభ్యుల కంటే ఎక్కువ మంది ఉండటంతో ఆర్డీవో వెంకట్‌రెడ్డి అవిశ్వాసం నెగ్గినట్లు తెలిపారు. రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసులు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

**పదవి కోసం పార్టీ మారినా..**

కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు సైతం తనపై పెట్టిన అవిశ్వాసంలో ఉన్నారని గ్రహించిన మేయర్ మహేందర్ గౌడ్ తన పదవిని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ పార్టీని వీడి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయినప్పటికీ పదవిని కాపాడుకోలేకపోయారని స్థానికంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా లతాప్రేమ్‌గౌడ్‌ను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అవిశ్వాసంలో పాల్గొన్న కార్పొరేటర్లను సన్మానించిన స్థానికులు